# 2.

# యువకులే భావి భారతోద్ధారకులు

విద్యార్థులారా!

భారతీయ సంస్కృతియందు అద్వైతతత్త్వమునకు అతి ప్రధానమైనది ఈ హిందూదేశము. ఈ హిందూ దేశమునందు ప్రకాశించు ఈ అద్వైత తత్త్వమునకు, వేరు మతములకు అనేక రకములైన భేదములు మనకు స్పష్టమవు తున్నాయి. అందున పాశ్చాత్య మతములకు, భారతదేశముయొక్క మతములకు మరింత భేదములు కనిపిస్తుంటాయి. పాశ్చాత్యులయొక్క మతమునందు దేహము, మనస్సు, బుద్ధి ఈ మూడింటియందు బుద్ధికి ప్రధానమైన స్థానమునిచ్చి, వారి మతముయొక్క అభివృద్ధికి పాటు పడటం జరుగుతుంటుంది. కాని, భారతీయ సంస్కృతి శరీరము, మనస్సు, బుద్ధి, చిత్తము ఈ నాలుగు అంతఃకరణయొక్క లక్షణాలుగా విభజించి ఆత్మను ప్రత్యేకమైన అధికారస్థానమునందుంచి, ఆత్మకు పరమాత్మకు ఎట్టి భేదమూ లేదనే సమన్వయాన్ని కూడను ప్రబోధిస్తూ వస్తుంది. అయితే, భారతదేశమందు కూడను ఈనాడు అనేక మతములు ప్రభవించి తద్వారా అనేక రకములైన భావములతో ఈ సంస్కృతిని మార్పు చేయటానికి కూడను పూనుకుంటున్నారు. మతములు ఎన్ని అయినప్పటికిని ప్రతి మతము కూడను సత్యమును పలుకమని, కుట్రలను పన్నకూడదని, తల్లిదండ్రులను గౌరవించాలని గురువులకు తగిన స్థానమును అందించాలని ప్రబోధిస్తూ వస్తున్నాయేగాని, తల్లిదండ్రులను అగౌరవపర్చమని, గురువులకు పంగనామాలు పెట్టమని లేక అసత్యములాడమని ఎట్టి మతము కూడను బోధించటానికి పూనుకోవటం లేదు. అన్ని మతములు కూడను తెలియనటువంటి భగవంతుని గూర్చి మాత్రమే భేదాభిప్రాయములతో అల్లకల్లోలపడుతున్నాయిగాని తెలిసినటువంటి నీతి నిజాయితీయందు భేదాభిప్రాయములకు ఏ మతము కూడను చోటివ్వటం లేదు. అయితే, ఈనాడు మతములు ఏ నిత్యసత్యమైన విషయములు ప్రబోధించునో వాటిని మాత్రము విసర్జించి ఆ మతము చెప్పని అన్యాయ, అక్రమ, అనాచార, అసత్యములను ప్రవేశపెట్టి, యిదే వారి జీవిత

srisathyasaivachanamrutam

లక్ష్యముగా భావించి ప్రవర్తించటం జరుగుతూ వుంటున్నది. కాని, మతములు చెప్పినవాటిని విస్మరించి, మతములు చెప్పనటువంటివాటిని విశ్వసించే విషయమునందు ఈ మతములపైన ఎంత విశ్వాసము ఉంటున్నదో యిందులో స్పష్టమైపోతున్నది. కనుక, ఏ యొక్క మతము శాసనరూపమైన శాస్త్రములుగా ప్రబోధించినవో వాటిని మాత్రమే విశ్వసించి మనము ఆచరణ రూపమైన ప్రచారము సల్పినప్పుడే, అది సత్యమైన విశ్వాసముగా వుంటుందిగాని, మతవిశ్వాసము, శాస్త్రవిశ్వాసము, ధర్మవిశ్వాసము అనేవి పలుకులతో మాత్రమే చెబుతూ ప్రవర్తనలయందు అతి విరుద్ధమైన నడతలు వుండటం చేత యిందులో మనలో విశ్వాసము యేమాత్రము సరియైనదికాదని స్పష్టమవుతున్నది.

అనేకమంది విద్యాధికారులు, విద్యావంతులు కూడను మతము అంటే ఏమిటి, భారతీయ సంస్కృతి అంటే ఏమిటి, ఆధ్యాత్మికము అనగా ఏమిటి అని అర్థము చేసుకోలేని మూర్ఖులుగా వుండి చిన్నపిల్లలయొక్క బుఱ్ఱలుకూడను పాడుచేసే ప్రయత్నమునకు పూనుకోవటం నేడు ఒక ప్రధానమైన మార్గంగా కనిపిస్తున్నది. కేవలం వీరిదంతా book knowledge గా కనిపిస్తున్నది గాని, హృదయములో వారికి ఏమాత్రము పరిచయము లేనట్లుగా తెలుస్తున్నది. అలాంటివారు విద్యాధికారులు కావటం చేత మన భారతదేశము మరింత అట్టడుగుకు పోతున్నది. కానీ ఈనాడు విద్యార్థులు మాత్రమే అట్టి విద్యాధికారులకు కూడను కన్నులు తెరిపించే మార్గాన్ని నిరూపించాలనే ఆశయము నాయందు ఎంతైనా వుంటున్నది.

**యువకుల ద్వారా భారతీయ సంస్కృతి పునరుద్ధరణ**

నా ఆశయమంతా యువకులపైననే ఆధారపడి వుంటున్నది. ఈనాటి యువకులు నా ఆశయాలను చక్కగా అనుభవించి, అర్థము చేసుకొని వారి యొక్క ఆచరణయందుంచటంచేత భారతదేశము ఎంతైనా బాగుపడటానికి అవకాశము వుంటున్నది. కనుక యిలాంటి అవకాశమును అందించి, వారిద్వారా అనాది వేదవిహితమైన భారతీయ సంస్కృతిని తిరిగి పునరుద్ధరింపచేసే ప్రయత్నమును సంకల్పించియే summer classes లో భారతీయ సంస్కృతిని బాలులైన మీ హృదయములో చేర్చి, తద్వారా పునరుద్ధరణగావించే ధర్మప్రయత్నానికి కంకణము



sri sathyasai vahamrutam

కట్టుకోవాలని కూడను నేను ఆశిస్తున్నాను. నిజముగా మనము దేనిని సత్యమని విశ్వసిస్తున్నామో, ఏది శాశ్వతమని భావిస్తున్నామో అవి అన్నియు క్షణకాలములో మార్పులు చెందుతున్నాయి. అందువలననే ఈ జగత్తుకు మర్త్యలోకము అని పేరు. అనగా యిది సత్యమూ కాదు, అసత్యమూ కాదు. మనకంటికి కన్పిస్తూ సత్యముగా ప్రకటిస్తున్నది ప్రపంచం. పోనీ సత్యముగా కనిపిస్తున్నదని విశ్వసిస్తిమా, కొంతకాలములో మాయమైపోతున్నది. కనుక కనిపించి, కనుపించని స్వరూపము కనుక, సత్యము అసత్యము రెండింటి మధ్యలో నున్నది కనుక సదసత్ (సత్+అసత్) అని కూడను దీనికి ఒక పేరు. పగటి పూట చూచిన దృశ్యము రాత్రి కలలో కనిపించటంలేదు. రాత్రి కలలో అనుభవించిన అనుభూతులు పగటియందు సత్యస్వరూపకంగా గుర్తించటానికి వీలుకాకుండా వుంటున్నాది. కనుక, మనము ఏది సత్యము ఏది అసత్యము అని నిర్ణయించుకోలేని పరిస్థితియందే మన భావములు చాలా తబ్బిబ్బైపోతున్నాయి. ఒక్కనెలలో చూచిన దేహములే మరొక నెలలో మార్పులు చెందుతున్నాయి. ఒక్క క్షణములో కలిగిన భావములే మరొక క్షణములో విరుద్ధముగా మారుతున్నాయి. ఒక్క క్షణములో ఉద్భవించిన తలంపులే మరొక క్షణములో విరుద్ధంగా మారిపోతున్నాయి. ఇలాంటి తలంపులు, యిలాంటి దేహములు, యిలాంటి భావములను నిత్యసత్యములుగా భావించి ఈ మర్త్యలోకములో జీవించటం చాలా అరుదుగా వుంటున్నది. అందునా ఈనాడు లోకమునందు ఎక్కడచూచినా ఏదో మరణవార్తలని, ఏదో అశాంతికి సంబంధించిన ప్రవర్తనలని, హింసా కృత్యములని, కొన్ని బాధాకరములైన భావములని అనేకరకములుగా మనము దుఃఖమునకు సంబంధించిన విషయములే వింటున్నాముగాని, మన హృదయాన్ని ఉప్పొంగింపజేసే అమృతత్వాన్ని వినేటువంటి భావములుగాని, వార్తలుగాని మనకు ఏమాత్రం కనిపించటంలేదు, వినిపించటం లేదు.

ఈ ప్రపంచము రెండు దినముల సంత. మన జీవితము రెండు గంటల ఆట. మన దేహమా రెండు నిముషముల నీటిబుడగ. యిలాంటి తత్త్వములోపల మనము ఎట్టి సార్థకత్వాన్ని అనుభవించటానికి పూనుకోవాలో మనకు మనమే అర్థము చేసుకోవచ్చును. దేహము రోగముల కొంప. మన సంసారము నల్లుల మంచము, ప్రపంచము దుఃఖముల యొక్క చేరిక. ఇక్కడ మనకు సంతోషము ఎక్కడ చిక్కుతుంది? కనుక, దేహముగాని లేక జగత్సంబంధమైన సుఖముగాని, యింక విషయ సంబంధమైన వాంఛలుగాని, మనకు

sri sathyasai vahamrutam

ఏమాత్రము ఆనందమును అందించటం లేదు. ఒక్క ఆత్మాన్వేషణయందు మాత్రమే సత్యానందము గుర్తించ టానికి మనకు వీలవుతుంది. రోగములు, దుఃఖములు, బాధలు అన్నియు సుఖమనే డ్రస్సును వేసుకుని మనలను వెంటాడి మనలను అనేక రకములుగా హింసిస్తూ వస్తున్నాయి. మనము వేసుకున్న డ్రస్సు అప్పటికప్పుడు మారుస్తుండటం మనకు సహజమే. అదే విధముగనే మనకు చిక్కేటువంటి సుఖముగాని, ఆనందముగాని లేక యింకేవిధమైన ఆహ్లాదముగాని డ్రస్సు వంటిదిగా అప్పటికప్పుడు మాత్రమే ఆనందాన్ని అందించి మరుక్షణములో మనలను అనేక రకముల బాధలకు గురిచేస్తున్నాది. నిజముగా యిట్టి ప్రపంచములోపల శాంతిగా, సంతోషముగా కాలమును గడుపుతున్నారనేటువంటి వ్యక్తిని చూచినప్పుడు చాలా ఆశ్చర్యము వేస్తుంది. ఎంత ధనవంతుడైనా, ఎంత విద్యావంతుడైనా, ఎంత పదవి, అధికారము వుండిన వారైనా ఏదో ఒక బాహ్యదృశ్యమందు సుఖసంతోషముల అనుకూలముగా వుండినట్లుగా తాను గోచరిస్తాడేగాని లోపల చాలా బాధ, బాధ్యత, కొన్ని కర్తవ్యముల యొక్క వత్తిడి కూడను అతనిని అనేకరకములుగా హింసించటానికి పూనుకుంటుంది. కనుకనే, మనము నిత్యానందమును అనుభవించే అద్వైతానందమును అన్వేషణ చేయటములో ఈ వయస్సు చాలా ప్రధానమైనది.

ఈనాడు ప్రపంచమునందు ఏవి ఉత్తమమైన కార్యములని మనము భావిస్తున్నామో అవి అన్నీ కూడను హాస్యాస్పదమైన కార్యాలుగా మనకు గోచరిస్తున్నాయి. ఇహపరముల భావములను ఏమాత్రము చింతించక దానికి తగిన ధర్మ కార్యములైనను తలంచక వుండే వ్యక్తులు అధికభాగంగా వుంటున్నారు. కాని, అట్లు చింతించి నప్పటికిని తన త్యాగమును చాలా స్వల్పముగా వుంచుకొని తాము అనేక రకములుగా ఖర్చుపెట్టే వాటియందు ఏమాత్రము త్యాగభావము రానివ్వక పరలోక ప్రాప్తినిమిత్తమై ధర్మాచరణయందు తనయొక్క భావములు కించిత్ పరచుకునే వ్యక్తులు కూడను చాలా అధికంగా వుంటుంటారు. అలాంటివారిని చూచి మనము చాలా గొప్పవారుగా భావిస్తున్నాము. తనయొక్క భోగభాగ్యముల కోసమని, తనయొక్క దేహాలంకార నిమిత్తమై, లక్షలకొలది పాడుచేసినవారిని మనము మహాబుద్ధిమంతులుగా విశ్వసిస్తున్నాము. కాలము కదలు కొలది, కాయము మారుకొలది కర్తవ్యమును గుర్తించక వాంఛలకు తమయొక్క జీవితమును అంకితము చేసిన వ్యక్తులను పెద్దవారుగా భావించి గౌరవిస్తున్నాము. క్షణక్షణము మృత్యువు ముఖములో నృత్యము చేయుచున్న కాయములకు జన్మోత్సవాలను జరుపుకొని

sri sathyasai vachanamrutam

ఆనందపడుతున్నాము. మరు నిముషములో ఏమి జరుగునో అనే సత్యాన్ని గుర్తించకుండా వర్తించే యిలాంటి వ్యక్తులయొక్క తత్త్వాలు ఏమని అర్థము చేసుకోవాలో సాధ్యముకాకుండా ఉంటున్నది. పామునోట చిక్కిన కప్ప తన ప్రాణములను ఏనిముషములోనైన వదలటానికి సిద్ధముగానున్నాననే సత్యాన్ని గుర్తించక, తాను ఏదో కొన్ని పురుగులు తినటానికని ప్రాకులాడుతున్నది. కానీ, ఈ పాము ఏ క్షణముననైనా నెమలివాతబడి చచ్చిపోదునో అనే సత్యాన్ని గుర్తించక కప్పను మ్రింగుతున్నాననే ఆనందములో తాను మూర్ఖముగా నిల్చిపోతున్నది. కాని, మరునిముషములో నా ప్రాణము ఏమవుతుందో అనే సత్యాన్ని గుర్తించక నెమలి తాను పామును తింటున్నట్లుగా భావిస్తుంటుంది. వెనుకనే వేటగాడు ఆ నెమలిపైన గురి పెట్టుకొని ఉంటాడు. అదేవిధముగా, ఈనాడు లోకములో ఒకరిని ఒకరు, ఒకరిని ఒకరు, ఒకరిని ఒకరు మ్రింగటానికే ప్రయత్నము చేస్తున్నారే గానీ తమను ఎవరు మ్రింగుతున్నారో అనే దానిని గుర్తించుకోవటం లేదు. "కాలకాల ప్రపన్నానాం కాలః కింకరిష్యతి", కాలమును మ్రింగేటువంటి వాడుగా వుండిన నీవు కాలము చేత మ్రింగబడుతున్నాననే రీతిగా భావించుకోవటం, యిదే పెద్ద అజ్ఞానం.

నీవు శరీరమానసిక చిత్తములయందు భ్రాంతులు పెట్టుకొనటం చేత నీవు కేవలము కాలమునకు లోబడినవాడుగా భావిస్తున్నావు. కాని, ఈ శారీరక మానసిక చిత్తములకు అతీతమైన ఆత్మస్వరూపుడుగా నీవు విశ్వసించినప్పుడు ఈ మరణము కూడను ఒక అమృతత్త్వముగా గుర్తించుకోవటానికి అవకాశము చిక్కుతుంది. కనుక, ఈ దేహముతో ఈ లోకములోకి రావటంచేతనే ఈ లోకములో మనమూ ఒక భాగాన్ని వహించటంచేత ఈ భాగములోనున్న సత్యాన్ని గ్రహించటానికి తగిన ప్రయత్నము సల్పటం యువకులకు ప్రధానమైన లక్ష్యం. **ప్రాతఃకాల స్వరూపమైన ఈ యువకులయందు అనేకరకములైన ఆధ్యాత్మిక విత్తనములు నాటి తద్వారా ఈ లోకమును తిరిగి పునరుద్ధరింపచేయటానికని కంకణము కట్టుకోటమే సాయి సంకల్పము. భావిభారతోద్ధారకులు కావటానికి మీరు అతి సరియైన వయస్కులు. సాయంకాల సమయ స్వరూపులైన పెద్దలకు చెప్పి యిందులో ప్రయోజనము ఉండదు. కనుకనే యువకులుగా ఉండటంచేత, ఈ నెల దినములు కూడను జరిగేటటువంటి భారతీయ సంస్కృతియేగాక, పాశ్చాత్య సంస్కృతి, అన్ని మతముల అభిప్రాయములను కూడను అందించి ఈ సత్య స్వరూపాన్ని మీరు సమన్వయపరిచే ప్రయత్నములోపల మిమ్ములను రూపొందింప జేయటమే ఈ సమావేశములయొక్క**

**అంతరార్థము.** కానీ, ఈ నెల దినములుకూడను, ఎట్టి అననుకూలములు జరిగినప్పటికి, సరియైన సదుపాయములు లేకపోయినప్పటికిని, మేము జన్మించటము కేవలము భారత దేశమునకు మాయొక్క జీవితమును అర్పితము చేసి, ఈ భారతదేశముయొక్క సత్కీర్తిని నిలబెట్టే నిమిత్తమై ఈ కాయమును ధరించామనే సత్యాన్ని మీ హృదయమందు ప్రతిష్ఠింపజేసుకొని ఈ కష్టములకు, నష్టములకు, అననుకూలములకు ఏమాత్రము చలించక, భ్రమించక మీరు ఈ సత్య స్వరూపమైన భావాన్ని మీయొక్క జీవితమునందు ప్రవేశింపజేసుకోవాలని నేను ఆశిస్తున్నాను.

**ఉద్రేకములు అరికట్టుకోవటం వల్ల జీవితంలో ప్రశాంతత**

"నా దేశము భారతదేశము, నా మతము భారతీయమతము, నా జీవితమే భారతదేశమునకు అర్పితము" యిలాంటి తత్వమునందు దేశము యొక్క సేవను మనము ప్రధాన దృష్టియందుంచుకొని, దేశము యొక్క పురాతనమైన, సనాతనమైన సంస్కృతిని మన హృదయ స్థానమందుంచుకొని, తద్వారా మీ ప్రవర్తన పవిత్రమైనదిగా రూపొందింపచేసుకోవటానికి మీరు సంసిద్ధులు కావాలి. ఉద్రేకములు అణచుకున్నప్పుడే మన జీవితము పరమ శాంతముగా వుంటుంది. శారీర, మానసిక, ఆధ్యాత్మిక బలములు వుండినప్పుడే యిలాంటి చిన్న చిన్న ఉద్రేకములను మనము అరికట్టుకోలేని బలహీనులుగా వుండినప్పుడు యిక వృద్ధాప్యమునందు అరికట్టుకోటానికి ప్రయత్నము చేసిన ఫలితము ఉండదు. కనుక, విద్య అనగా మన యింద్రియములయొక్క నిగ్రహము, మన భావములయొక్క పరిశుద్ధము చిత్తము యొక్క శుద్ధము, మనలను పవిత్రమైన మార్గమునందు ప్రవేశింపచేయుటమే విద్యకు సరైన అర్థము.

**మేఘములు మింటిపైజేరి మెసలుచుండ**
**వాటిదాపున విద్యుత్తు వరలునట్లు**
**విద్య వెనుక జ్ఞానంబు వెలయవలయు**
**దానినార్జించు వాడే విద్యార్థి**

జ్ఞానము ఆర్జించేవాడే నిజమైన విద్యార్థి.

**విద్య డిగ్రీలకొరకను వెఱ్ఱి వీడి**
**సేవకా వృత్తికై మీరు చేరబోక**

srisathyasaivachanamrutam

**స్వీయ దేశీయ సౌభాగ్య శ్రేయమరసి**
**జీవితాన్ని త్యాగము చేయుటకు పూనుకోండి.**

అంతేగాని మనము తెల్లవారినది మొదలు పరుండేంతవరకు ధనార్జన నిమిత్తమై మనము ఆర్జించిన విద్యనంతాకూడను అమ్ముకునే ప్రయత్నానికి పూనుకోకూడదు.

**నిద్రలేచిన దాది నిద్రపోయెడుదాక**
**ఆస్తికై కుస్తీలు వేస్తారయా**
**రూపాయి కోసమై లోపాయికారిగా**
**అడ్డమైనా గడ్డి తింటారయా**
**ధనము కోసము దైవధ్యానాలు, బోనాలు,**
**కోటి పన్నాగములు పన్నేరయా**
**రంగలింగాయంచు దొంగ మొక్కులు మొక్కి**
**పంగనామము ప్రజకు పెడతారయా**
**ఇతరులెరుగకయున్న ఈశ్వరుండెరుగడా!**
**తగిన ఫలమును అనుభవిస్తారయా**

కనుక మనము ఎవ్వరికి ఎన్ని రకములైన మోసములుగాని, దగాలుగాని, కుట్రలుకాని చేసినను, దైవమును మాత్రము మోసగించటానికి వీలుకాదు. దైవము నీ హృదయవాసి. ప్రతి ఒక్కటి హృదయాంతరాళమందు ప్రకాశిస్తూ ఉంటాయి. మన భారతీయ సంస్కృతియందు చిత్రగుప్తుడని మీరు విని ఉంటారు. చిత్రగుప్తుడు యమధర్మ రాజుకు ప్రైవేటు సెక్రటరీ. నీవు చేసిన మంచి చెడ్డలన్నీ ఒకదానిలో వ్రాసిపెట్టి ఉంటాడట. మీరు కొంత హాస్యాస్పదముగా అనుకోవచ్చును. యమధర్మరాజు ఎక్కడ, చిత్రగుప్తుడు ఎక్కడ? అతనికి ప్రైవేటు సెక్రటరీ ఏమిటి? యిదంతా ఆఫీసు క్రింద వస్తున్నది. ఇదంతా ఉండటంవల్ల జగత్తులో ఆధ్యాత్మికమన్నది విశ్వసించటానికి వీలవుతుందా అని మీరు సందేహించవచ్చు. భారతీయ సంస్కృతియందు ప్రతి పదమునకు అంతరార్థము లేకపోలేదు. కేవలం బాహ్యంగా విచారణ చేసుకోవటంచేత మనము అన్నింటిని అలక్ష్యముగా, హాస్యాస్పదముగా గుర్తిస్తూ వస్తున్నాము. కాలమే యముడు. ఆ యముడే కాలుడు అని పిలవబడుతాడు. కాయము పుట్టటంగాని, పెరగటం గాని, పరిణామము చెందటంగాని, నశించటం గాని కాలముచేతనే చేరిపోతున్నది. కాలమే లేక జననమరణాలు

sri sathyasai vahanamrutam

వుండటానికి వీలుండదు. కనుక, ఈ కాయమును అన్నిరకముల పరిణామము పొందించి నాశనము చేసే తత్త్వము కాలము కనుక కాలమునే కాలుడు అని యముడని విశ్వసిస్తూ వచ్చారు. ఇట్టి కాలుడు సూర్యుని కుమారుడు అని మన సంస్కృతి తెలుపుతూ వచ్చింది. అనగా, ఈ సూర్యునికి కూడను భార్య, సంసారము పిల్లలు వున్నారా అని తిరిగి సందేహము రావచ్చును. అనగా సూర్యోదయము సూర్యాస్తమయముచేతనే ఈ కాలము పుడుతున్నది. ఇంక చిత్రగుప్తుడు ఈ కాయమునందు ఆరించిల ప్రధానమైన స్థానములో చిత్తము అనే పేరుతో గుప్తముగా వుంటున్నాడు. ఈ గుప్తమైన చిత్తమునకే చిత్రగుప్తుడు అని కూడను పేరు. కనుక, మనము ఎట్టి సంకల్పములు సంకల్పించినప్పటికిని చిత్తము లోపల హత్తుకుని పోతుంటాయి. నిన్ను ఎవరైనా ఏదైనా ఒక విషయాన్ని అడిగినప్పుడు కొంతవరకు దాచుకొని అసత్యము చెప్పవచ్చుకాని చిత్తము అసత్యము చెప్పటానికి వీలు కాదు.

## ఋతం - సత్యం - ధర్మం

ఒక దొంగ, ఒక యింటికి రాత్రి వెళ్లి అనేక సామానులు దొంగిలించి వచ్చినప్పటికిని పోలీసు అతనిని పట్టి హింసించే సమయములో నేను దొంగతనము చేయలేదని చెప్పవచ్చునేగాని, రాత్రి దొంగతనము చేసినది నేనే అనే సత్యము చిత్తములో హత్తుకొని పోయి ఉంటుంది. ఆ చిత్తములో హత్తుకొనిపోయిన విషయమునకే ఋతము అని పేరు. మన యొక్క భావమును స్పష్టముగా గుర్తించి ఆ సత్యస్వరూపాన్ని చిత్తములో హత్తుకొనునట్లుగా చేయటము యొక్క పరిస్థితినే ఋతము అని పేరు. ఆ చిత్తములో హత్తుకుపోయిన స్వభావాన్ని వాక్కు లోపల ఉచ్చరించటమే సత్యము అని పేరు. ఏ పలుకులు నీ నాలుకనుంచి ఉచ్చరించితివో దానిని క్రియలో ఆచరింపచేసినప్పుడే ధర్మము అనిపేరు. ధర్మమనగా, మూడింటికి అవినాభావ సంబంధమున్నప్పుడే ధర్మమనే పదము సార్థకమవుతుంది. కనుక, అట్టి పవిత్రమైన ధర్మమునకు మనము అనేక అర్థములు అభివృద్ధి పరచుకొని మనము ఏది ధర్మము, ఏది అధర్మము అని నిర్ణయము చేసుకోలేని పరిస్థితియందుంటున్నాము.

దివ్యాత్మస్వరూపులారా! గురుశిష్యుల సాంప్రదాయమును పురస్కరించుకొని మన భారతీయ సంస్కృతిలోపల భజగోవిందం అనేది అతి ప్రఖ్యాతమైనది, జీవులకు అతి ప్రధానమైనది. ఇలాంటి వయస్కులకంతా అది శక్తివంతమైనది కనుక రేపటినుండి,

sri sathyasai vahini amrutam

భజగోవిందం అనే దానిలో 30 శ్లోకములు జగద్గురువులైన ఆదిశంకరాచార్యులద్వారా లోకానికి అందించిన పరమపవిత్రమైన నీతి భజగోవిందంలో వుంటున్నది. కనుక ఈ 30 దినములు ఒక్కొక్క శ్లోకమునకు సరియైన అర్థాన్ని బోధించి ఈ భజగోవిందము యొక్క సార్థకాన్ని మీకు అందించాలనేటువంటి సంకల్పము నాలో చాలా అధికంగా వుండటం చేత, ఒక్కొక్క శిష్యుడు ఏఏ సమయమునందు ఆ భజగోవిందమను శ్లోకమును ఉచ్చరించి ఆ భజగోవిందము యొక్క సార్థకతను, ఆ భజగోవిందము యొక్క అంతరార్థమును ప్రపంచమునకు వ్యాపింపజేశాడు అనేటటువంటిది రేపటి దినమునుండి ప్రారంభిస్తున్నాను. ఈ ముప్పై శ్లోకముల లోపలనే ముల్లోకాలంతా యిమిడి వుంటున్నాయి. ఇది కేవలము వేదశాస్త్ర ఇతిహాస పురాణములయొక్క ప్రమాణములు యీ శ్లోకములు ప్రత్యక్షమైనటు వంటి స్వరూపకంగా నిరూపణ అవుతున్నాయి.

ఈనాడు మీకు ఎక్కువగా శ్రమ వుండవచ్చును. మొదటి దినము కొంత అననుకూలముగా మీకు కొంచెం వుండవచ్చును. కొంత ముందుగానే వెళ్లి విశ్రాంతి తీసుకొని రేపటినుండి ఈ పెద్దలందించే రత్నాలను మీరు హృదయమందు దాచుకొని, ప్రతి సాయంకాలము స్వామి ప్రసంగములోపల అనేక రకములైన జీవితతత్త్వాన్ని, జీవిత రహస్యాలను కూడను అందిస్తుంటారు కనుక, ఈ నెలరోజులు తపస్సుగా, తపోవనంగా మీరు భావించి మీ జీవితాన్ని పవిత్రము చేసుకోవాలని, ఆశిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 21-05-1973 న సాయంకాలం బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasaivachanamrutam